@netifocusnews @focustv
http://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | హైదరాబాద్ | శనివారం 21, డిసెంబర్ 2024 | పేజీలు: 04

## 30 వరకు కెటిఆర్‌ను
# అరెస్ట్ చేయొద్దు



"ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో ఏ1గా ఉన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. కేటీఆర్‌ను ఈ నెల 30 వరకు అరెస్ట్ చేయరాదంది."

- ఫార్ములా-ఈ రేసు కేసులో హైకోర్టు ఆదేశం
- క్వాష్ పిటిషన్‌పై విచారణ 27కు వాయిదా
- జరగని ఒప్పందానికి ముందే చెల్లింపులా?
- గవర్నర్ అనుమతి, దర్యాప్తు తర్వాతే ఎఫ్ఐఆర్
- కేటీఆర్ పాత్ర ఏంటన్నది దర్యాప్తులో తేలుతుంది
- విదేశీ సంస్థకు చెల్లింపుల్లో తీవ్రమైన ఉల్లంఘనలు
- రేస్‌లో లాభాలొస్తే స్పాన్సర్ వెళ్లిపోతారా..?: ఏజీ
- రాజకీయ, వ్యక్తిగత కుట్రతోనే కేటీఆర్‌పై కేసు
- హైదరాబాద్ ఖ్యాతిని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారు
- ఫార్ములా-ఈ రేస్‌తో రూ.110 కోట్ల లాభం
- 14 నెలల కిందటి అంశంపై ఇప్పుడు కేసా?
- రేస్ రద్దవకుండా నాటి సర్కారే ముందుకొచ్చింది
- అరెస్ట్ సహా తదుపరి ప్రొసీడింగ్స్‌పై స్టే ఇవ్వండి
- కేటీఆర్ తరపున సుప్రీం న్యాయవాది సుందరం

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-డిసెంబర్ 20:

ఫార్ములా-ఈ కార్ రేసు కేసులో ఏ1గా ఉన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. కేటీఆర్‌ను ఈ నెల 30 వరకు అరెస్ట్ చేయరాదంది. కేసును యథావిధిగా దర్యాప్తు చేసుకోవచ్చంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలంటూ ఏసీబీకి, మునిసిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిశోర్‌కు నోటీసులు ఇచ్చింది. తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. తమది రెగ్యులర్ బెంచ్ కానందున.. రెగ్యులర్ రోస్టర్ కలిగిన ధర్మాసనం మిగతా 2లో..

## భూభారతి బిల్లుకు
# ఆమోదం

## వాడీవేడి చర్చ అనంతరం సభ తీర్మానం
## ధరణిపై సిబిఐ విచారణకు బిజెపి, డిమాండ్

- ప్రతి సమస్యా భూమితో ముడిపడి ఉంది
- భూమికోసం ఎన్నో పోరాటాలు సాగాయి
- ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి
- ధరణితో విదేశీ కంపెనీల చేతికి వివరాలు
- సభలో సిఎం రేవంత్ వెల్లడి
- బిఆర్ఎస్ సభ్యుల తీరుపై ఆగ్రహం



### 55 కోట్లు కాదు.. రూ. 600 కోట్ల స్కాం

- ఫార్ములా ఈ-రేస్ మీద ప్రభుత్వం తరపున పూర్తిస్థాయి వివరాలు సమర్పిస్తాం
- ధరణిని నిర్వహిస్తున్న వ్యక్తులు ఎవ్వరూ భారత పౌరులు కాదు
- కేటీఆర్ వెనకాలు ఉండి.. గాదె శ్రీధర్ రాజును ముందుంచి ఆ పని దక్కించుకున్నారు
- తెలంగాణ రైతుల వివరాలను దేశాలు దాటించిన కేసీఆర్
- తెలంగాణలో ప్రతి సమస్య భూమితో ముడిపడి ఉంది
- ఇప్పుడు ఆపడంతో 500 కోట్లు ప్రభుత్వానికి మిగిలాయి
- తెలంగాణ రైతాంగానికి ఎంతో మేలు జరిగే విధంగా సభను కొనసాగించిన స్పీకర్‌కు అభినందనలు
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్) -డిసెంబర్ 20:

తెలంగాణ అసెంబ్లీలో భూభారతి బిల్లు - 2024 ఆమోదం పొందింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బిల్లును ప్రవేశ పెట్టారు. భూ భారతి బిల్లు ప్రవేశ పెట్టే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. బిల్లు ఆమోదం పొందుతుండటంతో ఆనంద భాష్పాలు వస్తున్నాయన్నారు. సభలో భూ భారతి బిల్లు ప్రవేశ పెట్టిన మంత్రి..బిల్లును పాస్ చేయాల్సిందిగా స్పీకర్ ను కోరారు. సభ్యులు ఆమోదిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అనంతరం అసెంబ్లీని స్పీకర్ శనివారానికి వాయిదా వేశారు. భూభారతిపై చర్చ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతి మిగతా 2లో..



## కాపలా ఉంటరనుకుంటే
# వేట కుక్కల్లా దోపిడీ

- భూభారతి-2024 పేరిట దేశానికే ఓ రోల్ మోడల్ గా ఉండే రెవెన్యూ చట్టం ప్రవేశపెట్టడం నా అదృష్టం
- అసెంబ్లీలో భూభారతి-2024 ఆమోదం
- దోపిడీ పై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తాం
- తప్పు చేసింది ఆ దొరవారు, శిక్ష అనుభవించింది అమాయక ప్రజలు
- రెండు పిల్లుల రొట్టెకథ ఈ ధరణి
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-డిసెంబర్ 20:

తెలంగాణ రాష్ట్రం ఇస్తే రాష్ట్రానికి కాపలా కుక్కలా ఉంటానన్న గత ప్రభుత్వ పెద్దలు వేటకుక్కలుగా మారి అందినకాడికి దోచుకున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. కాపలా కుక్కలు వేట కుక్కలుగా మారి రాష్ట్రంలో భూదోపిడీ చేశాయని.. ఈ దోపిడిపై ఫోరెన్సిక్ మిగతా 2లో..

## 'ఈ-కార్ రేస్'లో అణాపైసా
# అవినీతి లేదు



### న్యాయపరంగా ఎదుర్కొంటాం: కేటీఆర్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-డిసెంబర్ 20:

ఫార్ములా-ఈ రేస్ కేసులో అణాపైసా అవినీతి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలతో ఈ కేసులో అవినీతి లేదని తేలిందన్నారు. ప్రొసీజర్ కరెక్ట్‌గా లేదని మాత్రమే అన్నారని చెప్పారు. ప్రభుత్వం కేసుపై ముందుకు వెళ్తే న్యాయపరంగా ఎదుర్కొంటామని చెప్పారు. హెచ్ఎండీఏ ఒక కార్పొరేషన్ అని, హైదరాబాద్ నగర ప్రగతికి పనికి వచ్చే ఏ కార్యక్రమానికైన డబ్బులు ఖర్చు చేయవచ్చని తెలిపారు. హెచ్ఎండీఏ చేసే ప్రతి పనికి ప్రభుత్వ అనుమతి అవసరం లేదని చట్టంలోనే ఉందన్నారు. మిగతా 2లో..

## డైవర్షన్‌లో భాగమే..
# కేటీఆర్‌పై కేసు

- ఫార్ములా ఈ రేస్‌పై రేవంత్ రెడ్డి చెప్పింది శుద్ధ అబద్ధం
- తొలి అడుగులోనే కేటీఆర్ నైతిక విజయం
- అలవిగాని హామీలిచ్చి రేవంత్ ప్రజలను మభ్యపెట్టిండు
- రేవంత్.. నువ్వెన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడం
- మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం

2





## బిఆర్ఎస్‌ది కచరా
# గవర్నమెంట్

- ధరణిని వారి కుటుంబం కోసం తెచ్చారు
- భూములపై ఆడిటింగ్ చేయాలన్న పట్టించుకోలే
- అసెంబ్లీలో బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ అక్బరుద్దీన్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-డిసెంబర్ 20:

ధరణి ఓ కుటుంబం కోసం తెచ్చిందని, దాంతో ప్రజలు ఎలాంటి లబ్ధి పొందలేదని ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా ఈ-రేసు అంశంపై చర్చకు భారాస సభ్యులు పట్టుబట్టడంతో పాటు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు యత్నించడంతో సభలో కాసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. భారాస సభ్యుల తీరును ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తప్పుబట్టారు. ఈ రోజు సభలో జరిగింది పదేళ్ల భారాస పాలనను తెలియజేస్తోందని వ్యాఖ్యానించారు. సభ్యులు ప్రజల సమస్యలు ప్రస్తావించేందుకు సభకు వస్తారని.. ఇలా ఆందోళన చేసేందుకు కాదన్నారు. పదేళ్ల భారాస పాలన.. కచరా గవర్నెన్స్ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'ఇవాళ సభలో జరిగింది భారాస సంస్కృతికి నిదర్శనం. భారాస సభ్యులకు కేసీఆర్ బోధించింది ఇదేనా? ధరణి.. ఒక కుటుంబం కోసం.. ఒక పార్టీ కోసమే తెచ్చారు. భూముల ఆడిటింగ్ జరగాలని పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నా. నా డిమాండ్‌ను భారాస ఏనాడూ పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా భూముల ఆడిటింగ్ మిగతా 2లో..

# భూభారతి బిల్లుకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి..)

సమస్య భూమితోనే ముడిపడి ఉందని అన్నారు. తెలంగాణలో ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేది భూమి. భూమిని కాపాడుకునే ప్రయత్నంలో దొడ్డి కొమరయ్య వంటి వారు ప్రాణాలు కోల్పోయారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మల్లు స్వరాజ్యం లాంటి అనేక మంది భూ పోరాటాలు చేశారు. పేదల భూములు కాపాడేందుకు పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారు. భూమిలేని పేదలకు ఇందిరాగాంధీ ప్రభుత్వ భూమి ఇచ్చి ఆత్మగౌరవం నిలబెట్టింది. ఆక్రమణలు తొలగించి రైతుల హక్కులు కాపాడేందుకు గత ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తెచ్చాయని అన్నారు. భూభారతిపై వాడీవేడిగా చర్చ సాగింది. బిల్లుపై విపక్ష బిఆర్ఎస్ సభ్యులు చర్చించకుండా ఆందోళనకు దిగారు. బిల్లుపై చర్చించాలని, ఇది రైతులకు సంబంధించినదని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పదేపదే సూచించారు. భూముల అన్యాక్రాంతం, లక్షల కోట్ల అవినీతి జరిందని డిప్యూటి సిఎం భట్టి, మంత్రి పొంగులేటి ప్రకటించినా ఎందుకు సిబిఐ విచారణకు ఆదేశించలేదని బిజెపి నేతమహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. ఈ క్రమంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సహనం కోల్పోయి స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల దారుణంగా వ్యవహరించారని అన్నారు. అమర్యాదగా ప్రవర్తించి సభాపతిపైనే పేపర్లు విసిరారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాసనసభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రతిపక్షం వ్యవహార శైలి, ధరణి పోర్టల్, కేసీఆర్, ఫార్ములా–ఈ కార్ రేసుపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన విషయాలు బయటపెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తనపై దారుణంగా ప్రవర్తించినా స్పీకర్ గడ్డం ప్రసాద్ మాత్రం సహనాన్ని ప్రదర్శించారని ఆయన అన్నారు. ప్రతిపక్షం అహంభావంతో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' మాత్రం రైతులను తమ భూములకు దూరం చేసింది. 2010లో ఒడిశా కూడా ఇదే ధరణి విధానాన్ని తీసుకొస్తే.. ఒడిశా ప్రభుత్వం తప్పు చేసిందని ఎన్ఐసీ, కాగ్ సూచించాయి. అనుభవం లేని ఐ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థకు అప్పగించొద్దని హెచ్చరించింది. తెలంగాణ ప్రభుత్వం మాత్రం యువరాజుకు అత్యంత సన్నిహితుడైన గాదె శ్రీధర్‌రాజు కంపెనీకి ధరణి పోర్టల్ నిర్వహణను అప్పగించారు. క్రిమినల్ కేసుల్లో ఇరుక్కున్న సంస్థలను ఐఎల్ అండ్ ఎల్ఎఫ్ఎస్ సంస్థ టేకోవర్ చేసుకుంది. అవకతవకలకు పాల్పడిన సంస్థకు ధరణి పోర్టల్ బాధ్యతను అప్పగించారు. ధరణి టెండర్ దక్కగానే ఈ సంస్థ పేరు, యాజమాన్యం మారింది. ఫాల్కన్ హెచ్‌బీ అనే ఫిలిప్పీన్ కంపెనీ, తర్వాత సింగపూర్ కంపెనీ ఇందులోకి వచ్చాయి. 50 లక్షల మంది రైతులు, వారి భూముల వివరాలను ఈ సంస్థ చేతిలో పెట్టారు. ట్యాక్స్ హెవెన్ దేశాల కంపెనీల చేతిలో మన ధరణి పోర్టల్ పెట్టారు. ఫిలిప్పీన్స్, సింగపూర్, కెమెన్ హైలాండ్స్, వర్జిన్ ఐలాండ్ మీదుగా ధరణి పోర్టల్ తిరిగింది. పోర్టల్ నిర్వహణ ఏ కంపెనీ చేతిలోకి వెళ్లినా.. సీఈవోగా గాదె శ్రీధర్‌రాజే ఉన్నారు' అని సీఎం వివరించారు. సీఎం ప్రసంగం తర్వాత భూ భారతి బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. విపక్ష పార్టీ అహంభావంతో అహంకారంతో వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సభా మర్యాదలను ఉల్లంఘించి సభాపతిపైనే దాడి చేస్తామన్న ధోరణిలో చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించిందన్నారు. 'రెచ్చగొట్టడం ద్వారా భూ భారతి బిల్లుపై చర్చను పక్కదోవ పట్టించాలని ప్రయత్నించినా.. చాలా ఓర్పుతో సభాపతి వ్యవహరించారు. ఏ మాత్రం సహనం కోల్పోకుండా.. వాళ్లంతట వాళ్లే సహనం చచ్చిపోయి సహకరించాల్సిన పరిస్థితి కల్పించి సభను ముందుకు నడిపించారు. తెలంగాణ రైతాంగానికి ఉపయోగపడే కీలకమైన, ముఖ్యమైన బిల్లుపై చర్చ జరిగే విధంగా కృషి చేసిన సభాపతిని అభినందిస్తున్నా' అని సీఎం తెలిపారు. అద్భుతమంటూ ధరణి పోర్టల్ తీసుకొచ్చారని, ధరణి గురించి గత ప్రభుత్వం ఎన్నో గొప్పలు చెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్ ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారని, కానీ వాస్తవాలు మరోలా ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆ పోర్టల్‌ను కేసీఆర్ కనిపెట్టలేదని, 2010లోనే ఒడిశా ప్రభుత్వం ఈ–ధరణిని తీసుకొచ్చిందని సీఎం వెల్లడించారు. ఒడిశా తెచ్చిన ధరణిలో లోపాలు ఉన్నాయని కాగ్ చెప్పిందని, కాగ్ తప్పుబట్టిన ధరణిని తెలంగాణలో ఎందుకు పెట్టారని అసెంబ్లీ వేదికగా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ తనకంటే గొప్పోళ్లు లేరని అనుకుంటారని, అందుకే ఆయన అలా ప్రవర్తిస్తారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కేటీఆర్‌కు అత్యంత సన్నిహితులకే ధరణి టెండర్లు కేటాయించారు. సత్యం రామలింగరాజు సంస్థలతో ఉన్న బంధంతోనే ధరణి పోర్టల్ తీసుకొచ్చారు. ధరణి నిర్వహణలో మన రాష్ట్ర పౌరులు ఎవరూ లేరు. కనీసం పక్క రాష్ట్రాలకు చెందిన వారూ లేరు. టీఎస్‌టీఎస్ ఆధ్వర్యంలోనే ధరణి టెండర్లు వేశారు. ఐటీ శాఖ పరిధిలోనే టీఎస్‌టీఎస్ ఉంటుంది. ఆర్థిక నేరాలు చేసిన కంపెనీల ద్వారా డేటాను దేశం దాటించారు. ప్రజలను మోసం చేసి సమాచారాన్ని క్రిమినల్స్‌కు అందించారు. ఈ నేరాలకు ఏం శిక్ష విధించాలో తెలియాలంటే చట్టాలన్నీ చదవాలి. ధరణిలోకి డజన్ల కొద్దీ కంపెనీలు ఎందుకు వచ్చాయి?. మన భూముల సమాచారం మొత్తం విదేశాల్లో ఉంది. రెవెన్యూ శాఖ, సీఎం దగ్గర ఉండాల్సిన సమాచారం విదేశాలకు వెళ్లింది. ఇన్ని అవకతవకలు ఉన్నా అద్భుతమంటూ ఎన్నికల్లో మాట్లాడారు. ఇవన్నీ మేము గత ఎన్నికల ముందే చెప్పాం. ధరణిలో మార్పులు చేయాలంటే ప్రభుత్వ అనుమతి ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించి కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయి. ధరణి పేరుతో వాళ్ల అరాచం, దుర్మార్గం చెప్పలేని స్థాయికి చేరింది. అనుమతి లేకుండా వ్యక్తిగత సమాచార సేకరణ నేరం. గాదె శ్రీధర్‌రావు ద్వారా విదేశాలకు సమాచారం పంపించారు. వాళ్లు ఒక్క క్లిక్ కొడితే సమాచారం మొత్తం నాశనమవుతుంది. మన దగ్గర ఉన్న సర్వర్లు క్రాష్ అవుతాయి. అందుకే విచారణకు ఇవ్వడంపై ఇంతకాలం ఆలోచన చేశాం. విదేశాలకు వెళ్లి వివరాలు ఇవ్వాలని కోరినా సహకరించలేదన్నారు.

## రూ.55 కోట్లు కాదు.. 600 కోట్లు స్కాం

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)–డిసెంబర్ 20:

**తెలంగాణ అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సహనం కోల్పోయి స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల దారుణంగా వ్యవహరించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అమర్యాదగా ప్రవర్తించి సభాపతిపైనే పేపర్లు విసిరారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాసనసభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రతిపక్షం వ్యవహార శైలి, ధరణి పోర్టల్, కేసీఆర్, ఫార్ములా–ఈ కార్ రేసుపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన విషయాలు బయటపెట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తనపై దారుణంగా ప్రవర్తించినా స్పీకర్ గడ్డం ప్రసాద్ మాత్రం సహనాన్ని ప్రదర్శించారని ఆయన అన్నారు. ప్రతిపక్షం అహంభావంతో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.**

తెలంగాణలో ప్రతి సమస్య భూమితో ముడిపడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మల్లు స్వరాజ్యం వంటివారు భూపోరాటాలు చేశారని ఆయన గుర్తు చేశారు. భూ పోరాటంలో దొడ్డి కొమురయ్య ప్రాణాలు సైతం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆత్మగౌరవం నిలబెట్టేదే భూమని, పేదల భూములు పరిరక్షించేందుకే పటేల్, పట్వారీ వ్యవస్థలను సైతం రద్దు చేశారని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. అద్భుతమంటూ ధరణి పోర్టల్ తీసుకొచ్చారని, ధరణి గురించి గత ప్రభుత్వం ఎన్నో గొప్పలు చెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్ ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారని, కానీ వాస్తవాలు మరోలా ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆ పోర్టల్‌ను కేసీఆర్ కనిపెట్టలేదని, 2010లోనే ఒడిశా ప్రభుత్వం ఈ–ధరణిని తీసుకొచ్చిందని సీఎం వెల్లడించారు. ఒడిశా తెచ్చిన ధరణిలో లోపాలు ఉన్నాయని కాగ్ చెప్పిందని, కాగ్ తప్పుబట్టిన ధరణిని తెలంగాణలో ఎందుకు పెట్టారని అసెంబ్లీ వేదికగా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ తనకంటే గొప్పోళ్లు లేరని అనుకుంటారని, అందుకే ఆయన అలా ప్రవర్తిస్తారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. "కేటీఆర్‌కు అత్యంత సన్నిహితులకే ధరణి టెండర్లు కేటాయించారు. సత్యం రామలింగరాజు సంస్థలతో ఉన్న బంధంతోనే ధరణి పోర్టల్ తీసుకొచ్చారు. టెండర్లను రామలింగరాజు కుటుంబ సభ్యులు దక్కించుకున్నారు. మూడు కంపెనీలు సంయుక్తంగా టెండర్లు వేశాయి. ఆయా కంపెనీలపై క్రిమినల్ ఆరోపణలు ఉన్నాయి. ఐఎల్ఎఫ్ఎస్ కు చెందిన టెరాసిస్ కంపెనీకి ధరణి పోర్టల్ అప్పగించారు. ఈ టెరాసిస్ కంపెనీని ఫిలిప్పీన్స్ సంస్థ కొనుగోలు చేసింది. ఈ కంపెనీలోకి సింగపూర్ కంపెనీ కూడా వచ్చింది. ఒక శాతం వాటా ఉన్న గాదె శ్రీధర్‌రాజు సీఈవో అయ్యారు. రకరకాల కంపెనీలకు ఇందులో వాటాలు ఉన్నాయి. ఈ వాటాలు అనేక చేతులు మారాయి. ధరణిపై తెలంగాణ అగ్రిమెంటు పలు దేశాలకు మారింది. ఫిలిప్పీన్స్, సింగపూర్, అమెరికా నుంచి ఐలాండ్ వరకూ వెళ్లింది. ఆర్థిక నేరాలకు పాల్పడే కంపెనీలు ఉన్న దేశాల్లో ధరణి కంపెనీ ఉంది. దాని నిర్వహణలో మన రాష్ట్ర పౌరులు ఎవరూ లేరు.

## ఈ–రేస్ కేసులో అణాపైసా అవినీతి జరగలేదు



(మొదటి పేజీ తరువాయి..)

దానికి ఆ మేరకు స్వతంత్రత ఉందని చెప్పారు. అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్ చేశారు. ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సీఎంను ఎవరో తప్పుదోవ పట్టిస్తున్నారా లేదా ముఖ్యమంత్రే అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారో అర్థం కావడంలేదని చెప్పారు. తనపై కేసు నిలవడదని స్పష్టం చేశారు. లీగల్‌గా ముందుకు వెళ్తామని, లంచ్ మోషన్ పిటిషన్‌పై కోర్టు తేలుస్తుందన్నారు. ఓఆర్ఆర్ లీజు అంశంలో సిట్ ఏర్పాటుపై కూడా కేటీఆర్ స్పందించారు. టీఓటీ పద్ధతి దేశంలో ఇప్పటికే అమలులో ఉందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లీజు డబ్బును రైతు రుణమాఫీకి ఉపయోగించామని చెప్పారు. ఆర్థిక వనరుల సమీకరణపై అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ అనేక సూచనలు ఇచ్చింది. ఓఆర్ఆర్ నుంచి డబ్బులు సేకరించవచ్చని సూచించింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా జాతీయ రహదారులు నుంచి డబ్బులు సేకరిస్తున్న టీఓటీ తరహాలోనే ఓఆర్ఆర్ లీజు నుంచి డబ్బులను సేకరించాం. ప్రైవేట్ కంపెనీకి లబ్ధి చేకూర్చినట్టు ఆరోపిస్తున్న రేవంత్ ఆ కంపెనీతో లీజుని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో ఓఆర్ఆర్ లీజుపై రూ.లక్ష కోట్ల అవినీతి అంటూ రేవంత్ రెడ్డి మాట్లాడిన అడ్డగోలు మాటలపై హెచ్ఎండిఏ పరువు నష్టం కేసు వేసింది. ఇప్పటికీ ఆ కేసు అలాగే ఉంది. ముఖ్యమంత్రి ఓఆర్ఆర్‌పై అనేకసార్లు కుంభకోణం అని మాట్లాడారు. మరి ఆ లీజును ఎందుకు రద్దు చేయడం లేదన్నారు. రేవంత్ రెడ్డి మున్సిపల్, హోంశాఖ మంత్రిగా ఉన్నారు. ఇలాంటి సందర్భంలో సిట్ ద్వారా తన పరిధిలో ఉన్న అధికారులతో వాస్తవాలు ఎలా బయటకు వస్తాయి. తన సొంత శాఖ అధికారులతో దర్యాప్తు చేస్తే నిజాలు ఎలా బయటకు వస్తాయో రేవంత్ చెప్పాలి. అందుకే ఓఆర్ఆర్ లీజును వెంటనే రద్దుచేసి.. సిట్టింగ్ జడ్జితో కానీ రిటైర్డ్ జడ్జితో కానీ నిష్పాక్షిక విచారణ జరిపించాలి. ఒకవేళ కుంభకోణం జరిగి ఉంటే ఆయాచితంగా లబ్ధి జరిగిన కంపెనీని కాంట్రాక్టు ఎందుకు రద్దు చేయడం లేదు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించకుంటే ఇది మరొక రాజకీయ కక్ష సాధింపు కేసు అని ప్రజలు అనుకుంటారు. న్యాయమూర్తి ఏర్పాటు చేసే బృందం జాతీయ రహదారుల సంస్థ విధానాలను అధ్యయనం చేయాలని కూడా సూచిస్తాం. మాపై ఆరోపణలు చేసి కక్ష సాధింపుల కోసం మాత్రమే పరిమితం కాకుండా వాస్తవాలు తెలిసేలా మాట్లాడాలి. కోకాపేట భూములపై రూ.10 వేల కోట్ల కుంభకోణం అంటున్నారు. స్కామ్ అయితే ఆ భూముల అమ్మకాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలి' అన్నారు. ఎమ్మెల్యేలకు శిక్షణ ఇచ్చి స్పీకర్, ప్రతిపక్ష సభ్యులపైకి వాటర్ బాటిళు ,, పేపర్లు విసరడం ఎలా అని శిక్షణ ఇచ్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. దళితుడు అంటూ పదే పదే చెప్పడం స్పీకర్ గౌరవాన్ని తగ్గించేలా చేయడమేనన్నారు.

## హైకోర్టులో క్వాష్ పిటిషన్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–డిసెంబర్ 20:

తనపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఫార్ములా–ఈ రేస్ వ్యవహారంలో ఏసీబీ కేసుపై క్వాష్ పిటిషన్ వేశారు. ఈ మేరకు కేటీఆర్ తరఫు లాయర్లు జస్టిస్ శ్రవణ్ కుమార్ బెంచ్ ముందు లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. భోజన విరామం తర్వాత పిటిషన్‌ను విచారించాలని కోరారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ పిటిషన్‌పై హైకోర్టు నేడు విచారించనుంది. కాగా, ఖలంచ్ మోషన్‌ను సింగిల్ బెంచ్ తిరస్కరించడంతో.. సీజే బెంచ్ ముందు పిటిషన్‌ను దాఖలు చేశారు. కాంగ్రెస్ సర్కార్ కుటిల ప్రయత్నంతో ఫార్ములా ఈ–కార్ రేసులో కేటీఆర్‌పై కేసు నమోదైంది. ఈ–కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్లు దుర్వినియోగం చేశారనే అభియోగంతో కేటీఆర్‌పై ఎంఏయూడీ సెక్రటరీ దానకిశోర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదు చేశారు. దీంతో కేటీఆర్‌పై ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదుచేసింది. ఎన్నికల నియమావళిని ధిక్కరిస్తూ, ప్రభుత్వ అనుమతి లేకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా రూ.54,88,87,043 కోట్లను యూకేకు చెందిన 'ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్' (ఎఫ్ఈఓ) కంపెనీకి హిమాయత్‌నగర్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి బదిలీ చేయించారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఇతరులపై కేసు నమోదు చేశారు. ఐసీపీ (బీఎన్ఎస్) 13(1)(ఏ), 13(2), సీపీయాక్ట్ 409, 120 (బీ) సెక్షన్స్ కింద అభియోగాలు మోపారు. ఈ మేరకు నాంపల్లి ఏసీబీ కోర్టుకు ఏసీబీ అధికారులు వివరణ ఇచ్చారు. రూ.10 కోట్లకు మించి బదిలీ జరిగితే ప్రభుత్వం, ఆర్థికశాఖ అనుమతి అవసరమని, సీజన్ 10 ఫార్ములా ఈ రేసింగ్‌కు స్పాన్సర్స్ లేక పోవడంతో హెచ్ఎండీఏ నిధులు మళ్లించారని, దీంతో విదేశీ కంపెనీకి చెల్లింపులతో హెచ్ఎండీఏకు అదనపు పన్ను భారమైందని దానకిశోర్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## శాసనసభలో తీవ్ర గందరగోళం

- ఈ కార్ రేసింగ్‌పై చర్చకు బిఆర్ఎస్ పట్టు
- భూభారతిపై చర్చను అడ్డుకునే యత్నం
- స్పీకర్‌పై పేపర్లు చించి విసిరిన సభ్యులు
- నిరసన తెలుపుతూ సభ నుంచి వాకౌట్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–డిసెంబర్ 20:

తెలంగాణ శాసనసభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఫార్ములా ఈ–రేసుపై ఏసీబీ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ భారాస ఎమ్మెల్యేలు చర్చకు పట్టుబట్టారు. ఈ క్రమంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం, తదితర పరిణామాలతో సభలో గందరగోళం ఏర్పడింది. దీంతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. ఫార్ములా ఈ–రేసుపై ఏసీబీ కేసు నమోదు చేయడం.. దీనిలో ఏ–1గా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేరును చేర్చడంపై ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభలో నిరసన వ్యక్తం చేశారు. ఫార్ములా ఈ–రేసు అంశంపై చర్చకు పట్టుబట్టారు. దీంతో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ భూ భారతి బిల్లుపై ప్రభుత్వం చర్చకు సిద్ధమైన నేపథ్యంలో తర్వాత నిర్ణయం తీసుకుందామని భారాస సభ్యులను ఉద్దేశించి చెప్పారు. ఫార్ములా ఈ–రేసు అంశం ఒక వ్యక్తికి సంబంధించినదని.. భూ భారతి బిల్లు రాష్ట్ర ప్రజలకు చెందినదని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లేందుకు భారాస సభ్యులు యత్నించారు. వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. దీంతో పలువురు భారాస ఎమ్మెల్యేలు పేపర్లు చించి సభాపతి వైపు విసిరారు. అదే సమయంలో కొందరు కాంగ్రెస్ సభ్యులు పేపర్లు చించి భారాస వైపు విసరడంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. అంతకుముందు భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అసెంబ్లీ జరుగుతున్న సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారు. కేటీఆర్‌ను అప్రతిష్ఠ పాల్జేసి భారాసను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. ఈ అంశంపై రకరకాల లీకులు ఇస్తున్నారు. మేం ఎలాంటి తప్పు చేయలేదు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఫార్ములా ఈ–రేసుపై నిర్ణయం తీసుకున్నాం. మేం తప్పు చేశామంటున్నారు.. దీనిపై సభలో చర్చించి ఆ తప్పేంటో చెప్పాలి. పెట్టింది అక్రమ కేసు కాకుంటే వెంటనే సభలో చర్చించాలి. మేం తప్పు చేయలేదని కేటీఆర్ చెప్పారు. ఈ విషయంలో స్పష్టమైన హామీ ఇస్తే సహకరిస్తాం'అని హరీశ్‌రావు అన్నారు. అయితే స్పీకర్ వారిని వారించినా వినలేదు. భూభారతిపై చర్చకు పల్లా రాజేశ్వర్ రెడ్డికి అవకాశం ఇచ్చినా మాట్లాడలేదు. అనంతరం నినాదాలు చేస్తూ శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. ఫార్ములా ఈ రేసుపై చర్చ జరపాలని బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీలో పట్టుబట్టారు. కానీ ప్రభుత్వం దానికి అనుమతించకపోవడంతో వారు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. ప్రపంచస్థాయిలో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను పెంచే లక్ష్యంతో హైదరాబాద్ నగరానికి ఫార్ములా ఈ కారు రేసింగ్‌ను కేటీఆర్ తీసుకొస్తే.. ఆయనపై అక్రమ కేసులు పెట్టడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. ఈ అంశంపై చర్చకు పెడితేనే నిజానిజాలు ప్రజలకు తెలుస్తాయని పేర్కొన్నారు.

## బిఆర్ఎస్‌ది కచరా గవర్నమెంట్

(మొదటి పేజీ తరువాయి..)

చేయాలి' అని అక్బరుద్దీన్ కోరారు. సభలో చర్చ కొనసాగుతుండగానే భారాస సభ్యులు వాకౌట్ చేశారు. సభలో భారాస సభ్యుల తీరు ఏమాత్రం బాగోలేదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. భారాస నేతలు పదేళ్ల పాటు తెలంగాణ ప్రజల గొంతు నొక్కేశారని మండిపడ్డారు. 'మా గొంతు నొక్కే అధికారం మీకు ఎవరిచ్చారు? తప్పుడు కేసు పెట్టారని కేటీఆర్ భావిస్తే నిరాహార దీక్ష చేయవచ్చు కదా?అలా చేస్తే కనీసం సానుభూతి అయినా వస్తుంది' అని కూనంనేని అన్నారు.

## కాపలా ఉంటరనుకుంటే వేట కుక్కల్లా దోపిడీ

(మొదటి పేజీ తరువాయి..)

ఆడిట్ చేపిస్తామని తెలిపారు. "సమాజంలో అట్టడుగు వర్గాలు మొదలుకొని భూ యజమానులకు మేలు చేసే విధంగా విస్తృత స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణతో రూపొందించిన 2024 భూ భారతి చట్టం అక్షరాలా భూ యజమానులకు చుట్టం." అని మంత్రి అన్నారు. ఇటు రాష్ట్రంలో.. అటు దేశంలో 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకువచ్చిన రెవెన్యూ చట్టాలు, సంస్కరణలు రైతాంగానికే కాకుండా యావత్తు ప్రజానీకానికి ఎంతో మేలు చేశాయని చెప్పడానికి గర్వపడుతున్నానని మంత్రి పొంగులేటి తెలిపారు.దేశ రైతు చరిత్రను సరికొత్త సంస్కరణలతో లిఖించిన ముగ్గురు వ్యక్తుల గురించి చెప్పాలి. అదృష్టవశాత్తూ ఈ సంస్కరణల త్రయం తెలంగాణ బిడ్డలే కావడం మరో విశేషం. భూకమతాల పరిమితి చట్టం తెచ్చిన నాటి ముఖ్యమంత్రి, తెలుగు ప్రధాని పీవీ నరసింహారావు, కౌలు రైతులకు మేలు చేసే విధంగా రక్షిత కౌలుదారి చట్టం తీసుకువచ్చిన నాటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు.. అదేవిధంగా జాగీర్ల రద్దులో కీలకంగా వ్యవహరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డి తమకు దిశానిర్దేశకులు అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ఇప్పుడు వారి అడుగుజాడల్లో ప్రజోపయోగమైన ఈ నూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకువచ్చామని తెలిపారు. మన రాష్ట్రానికి సంబంధించి ఒక్కసారి గత చరిత్రను పరిశీలిస్తే భూమి కోసం, భుక్తి కోసం.. వేలాది పీడిత రైతులు, కూలీలు పాల్గొన్న తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రలో చారిత్రాత్మక ఘట్టం అని అన్నారు.మనం చిన్నప్పుడు చదువుకున్న రెండు పిల్లులు రొట్టె కథలాగే ఈ ధరణి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రొట్టె పంచుకోవడం కోసం ఆ రెండు పిల్లులు గొడవ పడడం.. ఓ కోతి వచ్చి ఆ గొడవ తీరుస్తానని చెప్పడం, ఆ రొట్టెను 2 ముక్కలు చేస్తూ ఒకటి ఎక్కువైందని ఒకసారి, రెండవ ముక్క ఎక్కువైందని మరోసారి రొట్టెను పూర్తిగా కోతి తినేయడం మనకు తెలిసిన కథ. ఆ కోతిలాగే గత ప్రభుత్వంలో కొంతమంది పెద్దలు ప్రవర్తించి భూములను దోచుకున్నారని తెలిపారు. ధరణిలో తన భూమి తాను చూసుకొనే వీల్లేదు.. ఆనాడు అంతా రహస్యమే. ఇందిరమ్మ ప్రభుత్వంలో దొరలు, సామాన్యులకు ఒకటే విధానం. భూ భారతిలో అంతా పారదర్శకమేనని మంత్రి పొంగులేటి అన్నారు. తప్పు ఒకరిది.. శిక్ష మరొకరిది అన్నట్లుగా అనాలోచితంగా రాత్రికి రాత్రే గడీల మధ్య చట్టం చేసి తప్పుచేసింది ఆ దొరవారుజ. కానీ శిక్ష అనుభవిస్తుంది మాత్రం అమాయక పేద రైతులు అని మంత్రి తెలిపారు. ఈ రాష్ట్రంలో ఏ మండలానికి వెళ్లినా.. ఏ గ్రామానికి వెళ్లినా ఏ మారుమూల ప్రాంతానికి వెళ్లినా మనిషి అనే వాడు ఉన్న ప్రతిచోట ధరణి తెచ్చిన సమస్యలున్నాయని అన్నారు.

## డైవర్షన్‌లో భాగమే.. కేటీఆర్‌పై కేసు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–డిసెంబర్ 20:

కేటీఆర్‌ను అప్రతిష్టపాలు చేసి బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అసెంబ్లీ నడిచే సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారని చెప్పారు. ఫార్ములా–ఈ కార్ రేస్ అంశంలో స్పీకర్ చాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. ఫార్ములా–ఈ కార్ రేస్ అంశంలో రకరకాల లీకులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము ఎలాంటి తప్పు చేయలేదన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఫార్ములా–ఈ రేస్ నిర్ణయం తీసుకున్నామన్నారు. తాము తప్పు చేశామంటున్నారని, సభలో చర్చించి అదేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము చేసింది ఎందుకు తప్పుకాదో ఈ సభ ద్వారా మేం కూడా ప్రజలకు చెబుతాం. మీరు పెట్టింది అక్రమ కేసు కాకుంటే ఈ సభలో చర్చించాలన్నారు. తాము తప్పు చేయలేదని.. రాష్ట్రం కోసం చేశామని కేటీఆర్ చెప్పారన్నారు. అక్రమ కేసు పెట్టినప్పుడు కేటీఆర్‌కు చెప్పుకునే అవకాశం ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ 420 హామీలపై నిలదీస్తున్నందుకు, లగచర్ల రైతుల తరఫున పోరాటం చేస్తున్నందుకు కేటీఆర్‌పై కేసు పెట్టారని విమర్శించారు. ఈ క్రమంలో సభ సజావుగా నడిచేందుకు సహకరించాలని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. అయితే ఫార్ములా–ఈ రేస్ విషయంలో స్పష్టమైన హామీ ఇస్తే సహకరిస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. అది ఒక సభ్యుడికి సంబంధించ అంశమని, ముందు బిల్లులపై చర్చిద్దామని స్పీకర్ అన్నారు. అందుకు ఒప్పుకోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఫార్ములా–ఈ కార్ రేస్‌పై చర్చకు పట్టుపట్టారు. భూ భారతి బిల్లుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చర్చను ప్రారంభించడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం ముందు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో సభను స్పీకర్ వాయిదా వేశారు.

## ఎన్నికల హామీలపై చర్చ జరగాల్సిందే

– తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–డిసెంబర్ 20: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో అలవికాని హామీలు ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. ఆ హామీలపై చర్చ పెట్టాలని తాము కోరామని తెలిపారు. ఇవాళ ఉదయం శాసనసభ సమావేశాల ప్రారంభానికి ముందు మీడియా పాయింట్‌లో తలసాని మాట్లాడారు. ఫార్ములా వన్ రేసు సందర్భంగా అవినీతి జరిగిందంటూ తమ నాయకుడు కేటీఆర్‌పై కేసు పెట్టారని, ఫార్ములా వన్‌పై చర్చ జరగాలని తాము డిమాండ్ చేస్తున్నామని తలసాని వెల్లడించారు. శాసనసభలో తమ దళిత ఎమ్మెల్యేలకు చెప్పులు చూపించారని ఆయన ఆరోపించారు.

# ఖాకీ కర్కశత్వం..!



## చెరువును సర్వే చేయించి ఆక్రమణకు గురైన భూమిని స్వాధీన పరచుకోవాలి

- బీఆర్ఎస్ ఎస్టి సెల్ మండల నాయకులు జాటోత్ సురేష్ నాయక్.
- ఎస్ఆర్ఎస్పి డి ఈ కార్యాలయంలో వినతి.

తొర్రూరు(నేటి ఫోకస్ న్యూస్)డిసెంబర్ 20

తొర్రూరు పెద్ద చెరువును సర్వే చేయించి ఆక్రమణకు గురయిన భూమిని స్వాధీన పరుచుకోవాలని, మళ్లీ ఆక్రమణకు గురికాకుండా సరిహద్దులు ఏర్పాటు చేయాలని, ఆక్రమించి బిల్డింగులు నిర్మించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ ఎస్టీ సెల్ నాయకులు జాటోత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం తొర్రూరు పెద్ద చెరువు (ఊర చెరువు) ను సర్వే చేయించి ఆక్రమణకు గురికాకుండా చూడాలని ఎస్సారెస్పీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ నాయక్ మాట్లాడుతూ చెరువు విస్తీర్ణం ఎంతో సరిహద్దులు ఏర్పాటు చేసి ఆక్రమణకు గురికాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ఇంతకు ముందు చెరువు స్థలాన్ని ఆక్రమించి బిల్డింగులు నిర్మించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అన్నారు.





- ప్రభుత్వ ఉద్యోగిని చితకబాదిన వనపర్తి రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి.
- ఎస్పీ గిరిధర్ జోక్యంతో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితుడికి చికిత్స.
- ఒంటినిండా తీవ్ర గాయాలతో అల్లాడుతున్న బాధితుడు.
- ఎస్సై తీరుపై సర్వత్రా విమర్శలు.

వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్

భార్యాభర్తల మధ్య తలెత్తిన గొడవల నేపథ్యంలో రాజీ కుదిరించాల్సిన వనపర్తి రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి అత్యుత్సాహం చూపి ఓ ప్రభుత్వ ఉద్యోగిని కర్కశంగా చితకబాదిన ఉదంతం వనపర్తి జిల్లా కేంద్రంలో సంచలనం సృష్టించింది. కోడేరు మండలం ఎత్తం గ్రామానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగికి మహబూబ్నగర్ సమీపంలోని బండమీదిపల్లి గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో ఏడు నెలల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో సదరు అమ్మాయి తరపు బంధువులు బాధితుడిపై వనపర్తి రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ జలంధర్ రెడ్డికి ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాలను పిలిచి దంపతుల మధ్య సయోధ్య కుదిరించాల్సింది పోయి అందుకు భిన్నంగా వ్యవహరించారు. నేరస్తులు, దోపిడీదారులు, కబ్జాదారుల కంటే దారుణంగా లెదర్ బెల్టుతో శరీరం అంతా కమిలిపోయే విధంగా చితకబాదాడు. బాధితుడు తాను ప్రభుత్వ ఉద్యోగినని తాను చెప్పేది కూడా కాస్త వినండి సార్ అంటూ మొరపెట్టుకున్నప్పటికీ వినకుండా తనను కొట్టడంతో పాటు తన తరపు ఆడపడుచులను ఇష్టానుసారంగా దూషించడం తగదని ఎంత మొరపెట్టుకున్నా వినకుండా అరికాళ్ళు, పిరుదులు, మోచేతులు, తొడలు, వీపులు కమిలిపోయేలా ఇష్టానుసారంగా కొట్టాడని బాధితుడు వాపోయాడు. దెబ్బల తాకిడి తట్టుకోలేక పోలీసు స్టేషన్ లో ఓ మూలకు పడిపోయినప్పటికీ రాత్రి 8:30 గంటలు దాటిపోతున్నా బయటికి వదలకుండా చిత్రహింసలకు గురి చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం ఆ నోట, ఈ నోట జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ కు చేరడంతో ఆయన వెంటనే స్పందిస్తూ వనపర్తి సీఐ ని ఆదేశిస్తూ పరిస్థితిపై ఆరా తీసినట్లు తెలిసింది. సదరు ఎస్సై చేతిలో దాడికి గురైన బాధితుడు ఎస్పీ ఆదేశాల మేరకు వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. దాడికి కారకులైన తన భార్య తరపు బంధువులతో పాటు ఎస్సై జలంధర్ రెడ్డి విచక్షణారహితంగా కొట్టాడని మెడికో లీగల్ కేస్ డైరీలో వారి పేర్లను వైద్యులకు తెలిపినట్లు తెలిసింది. బాధితుడు కోలుకున్న తర్వాత సదరు ఎస్సై పై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో పాటు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు తెలిసింది. కాగా రూరల్ పోలీస్ స్టేషన్ లో జరిగిన ఉదంతాన్ని తెలుసుకునేందుకు ఫోకస్ న్యూస్ ప్రతినిధి సదరు ఎస్సై జలంధర్ రెడ్డికి పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ అందుబాటులోకి రాలేదు.

# విద్యాభివృద్ధికి చేయూతనియడం అభినందనీయం





- జిల్లా విద్యశాఖ అధికారి రవీందర్ రెడ్డి
- పదో తరగతి విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేసిన
- హైదరాబాదులో హెప్ టెక్నో సొల్యూషన్ కంపెనీకి డైరెక్టర్ సుంకరి శ్రీను-చైతన్య
- తండ్రి చదువుకున్న పాఠశాలలో చిన్నారి ఖుషి పుట్టినరోజు ఘనంగా వేడుకలు

నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు డిసెంబర్20

పెద్ద వంగర మండల కేంద్రంలో ని ఉన్నత పాఠశాలలో దాతలు అందజేస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి అన్నారు. పెద్దవంగరకు చెందిన సుంకరి శ్రీను– చైతన్య దంపతుల కూతురు ఈదురు ఖుషి మొదటి పుట్టినరోజు వేడుకలను పెద్ద వంగర ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. అనంతరం డీఈవో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ..ఇదే పాఠశాలలో శ్రీను చదువుకొని హైదరాబాదులో హెప్ టెక్నో సొల్యూషన్ కంపెనీని స్థాపించి ఆ కంపెనీకి డైరెక్టర్ గా విధులు నిర్వర్తించడం గర్వకారణమన్నారు. ఆర్థికంగా నిలదొక్కుకొని పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించడం ఆదర్శప్రాయం అన్నారు. పుట్టినరోజు వేడుకలకు ఆడంబరాలుగా డబ్బు వృధా చేయకుండా ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని శ్రీను దంపతులను అభినందించారు. ప్రతి ఒక్కరు శ్రీను దంపతులను ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ బడుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పెద్దవంగర ఉన్నత పాఠశాలలో 58 మంది, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న 43 మంది, మొత్తం 101 మంది విద్యార్థులకు రూ. 40,000 తో ఆల్ ఇన్ వన్ లు, ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు సొంత ఖర్చులతో అందజేశారని తెలిపారు. పెద్దవంగర ఉన్నత పాఠశాలకు చెందిన 58 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ లో సాయంత్రం ప్రతిరోజు స్నాక్స్ కోసం మరో రూ. 35,000 అందించారు. ఈ సందర్భంగా సుంకరి శ్రీను దంపతులు మాట్లాడుతూ.. పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు లాప్ టాప్, ప్రతిభ పురస్కారాలు అందిస్తామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి 100% రిజల్ట్ తీసుకువచ్చి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బుధవారం శ్రీనివాస్, తొర్రూర్ ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, ఎంపీడీవో వేణుమాధవ్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు సంకపెల్లి రవీందర్ రెడ్డి, మధుసూదన్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దుసాని సురేష్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాజలింగం, కవిరాజు, శ్రీధర్, హైమ, కాంగ్రెస్ నేతలు పూర్ణచందర్, వేణు, ఉప్పలయ్య, బంధువులు తదితరులు పాల్గొన్నారు.



## పూరి గుడిసె దగ్ధమైన బాధితురాలి ఆదివాసి కుటుంబాన్ని పరామర్శించిన సిబిఎం ట్రస్ట్ చైర్మన్ అనురాధ

అచ్చంపేట నియోజకవర్గం నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఆర్ భరత్ డిసెంబర్ 20

అమ్రాబాద్ మండలం నల్లమల్ల అడవి లోతట్టు ప్రాంతం మల్లాపూర్ చెంచు పెంటకు చెందిన చిర్ర ముత్తమ్మ గుడిసె ప్ర మాదవశాస్తూ అగ్ని ప్రమాదానికి దహనం కావడం జరిగింది. ఈ విషయం తెలిసిన వెంటనే అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సతీమణి అమ్రాబాద్ మాజీ జెడ్పిటిసి సిబిఎం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చిక్కుడు అనురాధ బాధితురాలను పరా మర్శించే ప్రభుత్వపరంగా వారికి కావలసిన వసతులు ఏర్పాటు అయ్యే విధంగా అచ్చంపేట ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సాహస హకారాలు అందే విధంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆమె ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హరి నారాయణ గౌడ్ మాజీ ఎంపీటీసీ శ్రీను, శోభ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మైదాన ప్రాంత గిరిజనులు ఏజెన్సీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిని తొలగించాలి

- ప్రైవేటు,ప్రభుత్వ పాఠశాలలో బోనాఫైడ్ ఇచ్చిన ప్రధాన ఉపాధ్యాయులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- అర్హులు లేని వారికి ఏజెన్సీ సర్టిఫికెట్ ఇచ్చిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- ఆర్డీఓకి వినతి పత్రం ఇచ్చిన తెలంగాణ గిరిజన సంఘం నాయకులు

అచ్చంపేట నియోజకవర్గం (నేటి ఫోకస్ ప్రతినిధి ఆర్ భరత్ డిసెంబర్ 20)



అచ్చంపేట. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రాంతంలోని పదరా అమ్రాబాద్ అచ్చంపేట బలు మూరు లింగాల ప్రాంతంలో ఏజెన్సీ గ్రామాలలో నివాసముంటున్న ఆదివాసి లంబాడి ఎరుకుల వారికి ఏజెన్సీ సర్టిఫికెట్లు ఇస్తూ మైదాన ప్రాం తంలో ఉండే దేవరకొండ చందంపేట మిర్యాల గూడ మైదాన ప్రాంత గిరిజనులకు ఏజెన్సీ సర్టిఫి కెట్ ఇవ్వడంతో ఏజెన్సీ ప్రాంతంలో ఉండే గిరిజ నులకు అన్యాయం జరిగిందని అట్లాంటి వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని తెలం గాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అచ్చంపేట ఆర్డిఓ మాధవి కీ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్ మాట్లాడుతూ.. 2017 సంవత్సరంలో తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వ ర్యంలో పదరా అమ్రాబాద్ లింగాల అచ్చంపేట ప్రాంతాల్లో అర్హులు లేని గిరిజనులకు ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని ఇది సరైన కాదని అనేకసార్లు తాసిల్దారులకు వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోకుండా అవినీతికి పాల్పడుతూ అక్ర మంగా సర్టిఫికేట్ ఇస్తూ సహకరించిన తాసిల్దా రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలం గాణ గిరిజన సంఘంగా డిమాండ్ చేశారు. మైదాన ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు ఏజెన్సీ సర్టిఫికెట్ ఇవ్వడంతో ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటున్న గిరిజనులకు అన్యాయం జరిగిందని ఉద్యోగాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏజెన్సీ హక్కులు దక్కాల్సిన వారికి ఏజెన్సీ హక్కులు దక్కకుండా ఏజెన్సీ హక్కులు లేనటువంటి వారికి ఏజెన్సీ హక్కులు దక్కడం దుర్మార్గం అని అన్నారు ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో విచారణ చేసి ఎవరైతే ఏజెన్సీ సర్టిఫికెట్ ఇచ్చారు అట్లాంటి అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అట్లాగే ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగాలు రానటువంటి వారు అర్హులు కలిగినటువంటి వారికి ఉద్యోగ అవకా శాలు కల్పించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. కొందరు ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటూ ఈ ప్రాంతంలో చదవకుండా సుదూర ప్రాంతాల్లో చదివినటువంటి వాళ్ళు కూడా మూత పడ్డ ప్రైవేటు పాఠశాలలో చదివినట్టుగా బోనఫైడ్ తీసుకొని ఉద్యోగాలు పొందిన వారిని కూడా గుర్తించి అట్లాంటి వాళ్ళు కూడా ఉద్యోగాల నుంచి తొలగించాలని సంఘంగా వారు డిమాండ్ చేశా రు. దాదాపుగా ఏజెన్సీ ప్రాంతంలో అర్హులు లేనటు వంటి వారికి 600 మంది దాకా ఉద్యోగ అవకా శాలు పొందారని అట్లాంటి వాళ్ళు ఉన్నారని అన్ని రంగాల్లో ఉపాధ్యాయ రెవిన్యూ హెల్త్ డిపార్ట్మెంట్ తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు పొందారని అట్లాంటి వాళ్ళను గుర్తించి ఉద్యోగాల నుంచి తొలగించి అర్హులు కలిగిన ఏజెన్సీ గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి న్యాయం చేయాలని ఆర్డీవో ని వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం తాలూకా కార్యదర్శి దగ్న నాయక్, గిరిజన నాయకులు లక్ష్మణ్, బాలు,వెంకట్రావు,తదితరులు ఉన్నారు.





## ఉమామహేశ్వర స్వామి దేవస్థానానికి 25వేల 116 విరాళము

అచ్చంపేట నియోజకవర్గం నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఆర్ భరత్ డిసెంబర్ 20

శ్రీశైలం పుణ్యక్షేత్రం ఉత్తర ద్వారమైన శ్రీ ఉమామహేశ్వర స్వామి పుణ్యక్షేత్రానికి దైవదర్శనానికి వచ్చిన దాసర్లపల్లి గ్రామ వాస్తవులు గంగుల నర్సిరెడ్డి ధర్మాపతి కవిత కుటుంబ సభ్యులు గౌతంరెడ్డి అర్చన వరుణ్ రెడ్డి సుష్మా రెడ్డి శ్రీ ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ఉమామహేశ్వర దేవస్థానంలో జరుగుతున్న ఆలయ అభివృద్ధిని చూసి నిత్య అన్నదానం కోసం 25116 రూపాయలను విరాళము అందించడం జరిగినది. ఈ సందర్భంగా వారికి దేవస్థాన కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు అదేవిధంగా ఆలయ వేద పండితులు శాలవతో సన్మానించి శ్రీ ఉమామహేశ్వర స్వామి అనుగ్రహం ఉండాలని మనసు పూర్తిగా ఆశీర్వచనం ఇవ్వడం జరిగినది.



## ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల కృషి ఎనలేనిది

- తొర్రూరు ఏఎంసీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి.
- 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ.

తొర్రూరు(నేటి ఫోకస్ న్యూస్)డిసెంబర్ 20

ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల కృషి ఎనలేనిదని తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ (ఏఎంసి) హనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణ కేంద్రంలో మహా న్యూస్ టీవీ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ను ఐజేయు జాతీయ కౌన్సిల్ మెంబర్ దూలం శ్రీనివాస్, మహా న్యూస్ ఛానల్ పాలకుర్తి నియోజకవర్గ ప్రతినిధి పంజాల శ్రీకాంత్లతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడమే కాకుండా ప్రజా సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి చేరవేయడంలో జర్నలిస్టుల కృషి ఎనలేనిదని అన్నా రు. పట్టణంతోపాటు మండలంలో ఏ సమస్య ఉన్న మా దృష్టికి తీసుకువస్తే ఆ సమ స్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని... జర్నలిస్టులందరూ చిన్న సమస్య అయినా మా దృష్టికి తీసుకు రావాలని జర్నలిస్టులకు సూచించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జర్నలిస్టులు నారా యణ రాజు, మెరుగు రమేష్, ప్రసాద్, యాకన్న, శ్రీకాంత్, సంతోష్, రవి, భాస్కర్, సోమేష్, తదితరులు పాల్గొన్నారు.



## నేరవధిక సమ్మెలో గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయులు

- అరులైన ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలి
- ఉద్యోగ భద్రత కల్పించి టైం స్కేల్ అమలు చేయాలి
- మద్దతు తెలిపిన వివిధ ఉపాధ్యాయ సంఘాలు

అచ్చంపేట నియోజకవర్గం నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఆర్ భరత్ డిసెంబర్ 20

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయులు నిరవధిక సమ్మె కార్యక్రమంలో రావడం జరిగినది. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ కాంట్రాక్టు ఉపాధ్యాయ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు నాగర్ కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం రోజున నేరవధిక సమ్మె కార్యక్రమం చేపట్టడం జరిగినది. ఈ సందర్భంగా వారికున్న డిమాండ్లు అరులైన కాంట్రాక్టు ఉపాధ్యాయులందరికీ వారికి 61సంవత్సరాలు నిండే వరకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ తక్షణమే వారికి మినిమం టైం స్కేలు అమలు చేయాలని ,దారులైన ఉపాధ్యాయులను క్రమబద్ధకరించాలి,ప్రతినెల 1వ తేదీన గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలి, మహిళా కాంట్రాక్టు ఉపాధ్యాయులకు వేతనాలతో కూడిన 180 రోజుల ప్రసతి సెలవులు వర్తింపచేయాలి, అదేవిధంగా సిఆర్టిలకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలి, అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు మరియు డైలీవేజ్ వర్కర్లకు గిరిజన సంక్షేమ శాఖ అనే హెల్త్ కార్డు సౌకర్యాన్ని కల్పించాలని వారి యొక్క ప్రధాన డిమాండ్ గా ప్రభుత్వం ముందు ఉంచడం జరిగినది. నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలో నిరవధిక సమ్మె చేపట్టడం జరిగినది ఈ సమ్మెకు పిఆర్టియు జిల్లా సంఘం,యుటిఎఫ్ జిల్లా సంఘం, మరియు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్ఎన్టి సుధాకర్ రావు మద్దతు తెలపడం జరిగినది.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి రాజు జవహర్లాల్ నరేష్ నాయక్ సైలపతి కృష్ణయ్య హరిపొద్దిన్ సుధీర్ ఆంజనేయులు రాజేష్ నాగజ్యోతి జానకి మహేష్ చాజు తదితరులు పాల్గొన్నారు.




# రామ్ చరణ్ అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్ ఉన్న నటుడు

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా స్టార్ డైరెక్టర్ ఎస్.శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'గేమ్ చేంజర్' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన కియారా అద్వాణీ హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాను అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఈ మూవీ జనవరి 10న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ క్రమంలో దర్శకుడు శంకర్ కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఈ చిత్రానికి, ఆ పాత్రకు రామ్ చరణ్‌ను ఎంపిక చేసుకోవడానికి గల కారణాన్ని శంకర్ వివరించారు.శంకర్ ఏం చెప్పారంటే "ఆర్‌ఆర్‌ఆర్ రిలీజ్‌కి ముందే ఈ సినిమా చేయాలని రామ్ చరణ్ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో రామ్ చరణ్ నటిస్తే బాగుంటుందని దిల్ రాజు భావించారు. నాకు కూడా అదే పర్‌ఫెక్ట్ ఛాయిస్ అనిపించింది. నా కథల్లో యూనివర్సల్ అప్పీల్ ఉంటుంది. కాబట్టి ఓ పెద్ద హీరో అయితే బాగుంటుందని అనుకుని రామ్ చరణ్‌తో ప్రయాణం ప్రారంభించాం. రామ్ చరణ్‌ని చూస్తే.. లోలోపల ఏదో తెలియని శక్తిని అదుపు చేసి పెట్టుకుంటున్నట్టుగా అనిపిస్తుంది. సమయం, సందర్భంగా వచ్చినప్పుడు ఆ శక్తి విస్ఫోటనం చెందుతుందా? అన్నట్టుగా ఉంటుంది.మంచి స్క్రీన్ ప్రెజెన్స్ ఉన్న రామ్ చరణ్ ఎలాంటి సీన్ అయినా అద్భుతంగా, అందంగా హ్యాండిల్ చేస్తారు"అని తెలిపారు. ఈ సినిమాలో అవినీతి రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేసే ఐఏఎస్ అధికారిగా రామ్ చరణ్ కనిపించనున్నారు. ప్రస్తుతం తమన్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రంలోని 'జరగండి', 'రా మచ్చా', 'జానా హైరాన్ సా' పాటలు చార్ట్ బస్టర్‌లుగా నిలిచాయి. నాలుగో పాట అయిన డోప్%ా% ఈనెల 22న విడుదల కానుంది. ఇప్పటికే రిలీజ్ చేసిన డోప్ ప్రోమో అందరినీ మెప్పించింది.






# 100 ఏళ్ల బాలీవుడ్ చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించిన 'పుష్ప 2 ది రూల్'

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన క్రేజీ సీక్వెల్ పుష్ప 2 ది రూల్ బాలీవుడ్‌లో సరికొత్త రికార్డును సృష్టించింది. 100 ఏళ్లు కలిగిన బాలీవుడ్ చరిత్రలో ఫస్ట్ టైం ఒక డబ్బింగ్ సినిమా హిందీ సినిమా కంటే అత్యధిక వసూళ్లను సాధించింది. పుష్ప 2 ది రూల్ విడుదలైన మొదటిరోజు నుంచే హిందీలో రికార్డులను నమోదు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే షారుఖ్ ఖాన్ జవాన్ రికార్డును బద్దలుకొట్టి అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలిచిన ఈ చిత్రం తాజాగా మరో అరుదైన రికార్డును అందుకుంది. ఈ సినిమా తాజాగా రూ. 1500 కోట్ల క్లబ్‌లో ఎంటర్ అయ్యింది. ఇందులో వరల్డ్ వైడ్‌గా రూ.900 కోట్లు రాగా.. కేవలం హిందీలోనే రూ.632 కోట్ల వసూళ్లను సాధించింది. దీంతో ఫస్ట్ టైం రూ.632 కోట్లు దాటిన హిందీ సినిమాగా చరిత్ర సృష్టించింది. దీంతో 100 ఏళ్ల బాలీవుడ్ చరిత్రలో ఈ ఫీట్ సాధించిన మొదటి చిత్రంగా పుష్ప 2 రికార్డులకెక్కింది. పుష్ప 2 కంటే ముందు ఈ రికార్డు 'స్త్రీ 2' సినిమాపై ఉంది. ఈ చిత్రం రూ.625 కోట్లు వసూళ్లను సాధించి ప్రస్తుతం రెండో స్థానంలో నిలిచింది. అలాగే ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక వసూళ్లు సాధించిన రెండో చిత్రంగా పుష్ప 2 నిలిచింది.






# అమరన్‌కు అవార్డుల పంట

## ఉత్తమ నటుడిగా విజయ్ సేతుపతి

కోలీవుడ్ నుంచి తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ స్టార్‌డమ్ సంపాదించుకున్న వారిలో లీడింగ్‌లో ఉంటారు విజయ్ సేతుపతి , సాయిపల్లవి. సినిమా సినిమాకు తమ పర్‌ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఫిదా చేయడం ఈ స్టార్ యాక్టర్ల స్పెషాలిటీ. తాజాగా ఇద్దరు ఉత్తమ నటులుగా అవార్డులు అందుకుని వార్తల్లో నిలిచారు. 22వ చెన్నై ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ డిసెంబర్ 19న ముగిసింది. ఈవెంట్‌లో వివిధ కేటిగిరీల్లో అవార్డులను ప్రదానం చేశారు. సాయిపల్లవి ఇటీవలే అమరన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా.. ఈ చిత్రానికి ఉత్తమ నటిగా అవార్డు అందుకుంది. ఈ మూవీ ఉత్తమ చిత్రం, ఉత్తమ సినిమాటోగ్రఫీ విభాగాల్లో అవార్డులు అందుకుంది. మరోవైపు విజయ్ సేతుపతి మహారాజ చిత్రానికి ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నాడు. వీరితోపాటు పలు సినిమాలకు వివిధ విభాగాల్లో అవార్డులు దక్కాయి.

**అవార్డ్ విజేతలు..**

అమరన్ :
**ఉత్తమ నటి** : సాయిపల్లవి
**ఉత్తమ ఎడిటర్:** ఫిలోమిన్ రాజ్
**ఉత్తమ సంగీత దర్శకుడు:** జీవీ ప్రకాశ్ కుమార్
**ఉత్తమ సినిమాటోగ్రఫీ :** సీహెచ్ సాయి

**మహారాజ :**
**ఉత్తమ నటుడు:** విజయ్ సేతుపతి
**ఉత్తమ రచయిత:** నిథిలన్ స్వామి నాథన్
**ఉత్తమ సహాయ నటి:** దుషారా విజయన్ (వెట్టైయాన్)
**ఉత్తమ దర్శకుడు (స్పెషల్ జ్యూరీ అవార్డ్) :** పా రంజిత్ (తంగలాన్)
**ఫేవరేట్ యాక్టర్ అవార్డ్ :** అరవింద్ స్వామి




# నన్ను పని చేసుకోనివ్వండి..

## అభిమానులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రిక్వెస్ట్

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శుక్రవారం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలలో పర్యటించిన విషయం తెలిసిందే. రోడ్లు లేక ఇబ్బంది పడుతున్న గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 9 గ్రామాల్లో సుమారు 50 కోట్లతో రహదారుల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అయితే పవన్‌ని చూడడానికి అభిమానులు పెద్దఎత్తున్న తరలివచ్చారు. ఈ నేపథ్యంలో అభిమానులకు పవన్ రిక్వెస్ట్ చేశాడు.ఆయన మాట్లాడుతూ.. అభిమానులను నేను కోరేది ఒక్కటే. దయచేసి నన్ను నా పని చేసుకోనివ్వండి. నేను బయటికి వచ్చినప్పుడు మీరు నా మీద పడిపోతే నేను ఏ పని చేయలేను. రోడ్ల పరిస్థితి ఎలా ఉంది చూద్దాం అంటే అందరూ ఇక్కడే ఉండడంతో ఏం కనిపించట్లేదు. ఓజీ ఓజీ అని అరిస్తే పనులు జరగవు. నేను పనిచేస్తే మీ ఫ్యూచర్‌కి మంచి జరుగుతుంది. నేనున ఎక్కడికి వెళితే అక్కడ నన్ను చుట్టుముడితే నేను పనిచేయలేను. తెలుగు నేర్పించిన నేల ఇది. తిరుగుబాటు అంటే ఏంటో తెలిపిన నేల ఇది. ఇప్పుడు ఏంటంటే సినిమాల మోజులో పడి హీరోలకు జేజేలు కొట్టి మీ జీవితంలో బాధ్యతలు మర్చిపోతున్నారు. మాట్లాడితే అన్న మీసం తిప్పు అంటారు.. నేను మీసం తిప్పితే రోడ్లు పడవు.. పనులు జరగవు. అందుకే నన్ను పని చేయనివ్వండి అంటూ పవన్ కళ్యాణ్ చెప్పుకోచ్చారు.



# ఆ ప్రేమ పేజీ తీయనా

## ప్రేయసి జ్ఞాపకాలను భార్యతో పంచుకుంటున్న వెంకటేశ్

'నాలైఫ్‌లోనున్న ఆ ప్రేమ పేజీ తీయనా.. పేజీలో రాసున్న అందాల ఆ పేరు మీనా.. ట్రైనర్‌గా నేనుంటే ట్రైనీగా వచ్చిందా కూనా.. వస్తునే వెలుగేదో నింపింది ఆ కళ్లలోనా.. చిత్రంగా ఆ రూపం.. చూపుల్లో చిక్కిందే.. మత్తిచ్చే ఓ ధూపం.. ఊపిరిలో జల్లిందే..' ఈ సాహిత్యం వింటే ప్రేమించిన అమ్మాయిని గుర్తు చేసుకుంటూ అబ్బాయి పాడే పాట అని ఎవరైనా ఇట్టే చెప్పేస్తారు. అయితే.. దర్శకుడు అనిల్ రావిపూడి ఇంకాస్త కొత్తగా ఆలోచించాడు.తన ప్రేయసి జ్ఞాపకాలను భార్యతో పంచుకుంటూ భర్త పాడే పాటగా దీన్ని చిత్రీకరించాడు. ఆ భర్త విక్టరీ వెంకటేశ్ కాగా.. భార్య ఐశ్వర్య రాజేష్. ఇక ప్రేయసి ఎవరో తెలిసిందేగా.. మీనాక్షి చౌదరి. రానున్న సంక్రాంతికి సందడి ఏ స్థాయిలో ఉండనుందో ఈ పాటతో చెప్పేశారు 'సంక్రాంతికి వస్తున్నాం' టీమ్. ప్రచారంలో భాగంగా ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు, తొలిపాటగా విడుదలైన 'గోదారి గట్టు'కు అద్భుతమైన స్పందన వస్తున్న నేపథ్యంలో గురువారం విడుదలైన ఈ రెండో పాట.. తొలిపాటను మించేలా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరచి, ప్రణవి ఆచార్యతో కలిసి ఆలపించారు. వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి.

